Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

గురువారం 13/08/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




## షాది ముబారక్, కల్యాణలక్ష్మి లపై హైకోర్టు స్టే




**టి మీడియా, ఆగస్టు 12, హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలో షాది ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలపై హైకోర్టు స్టే విధించింది. ఈ సందర్భంగా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా మభ్యంతర ఉత్తర్వులు జస్టిస్ శ్రవణ్ కుమార్ జారీ చేశారు. దీనిపై తదుపరి విచారణ వరకు ఎలాంటి చెల్లింపులు ఈ పథకాల కింద చేయవద్దంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.మళ్లీ విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది హైకోర్టు. ఉచిత పథకాల అమలుపై న్యాయవాది విజయ గోపాల్ వేసిన పిటిషన్ హై కోర్టు లో పిటిషన్ వేయడంతో ఈ విచారణ నిర్వహించింది హైకోర్టు.

# 5 నియోజకవర్గాల్లో మహిళా సంఘాల గోదాములు

**● సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష ● హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు**



**టి మీడియా, ఆగస్టు 12, హైదరాబాద్ బ్యూరో :**
రైతులకు సాగునీరు అందేలా, ప్రతి ఎకరాకు నీటి భరోసా కల్పించే దిశగా సమన్వయంతో పనిచేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై రేవంత్ రెడ్డి సమీక్షించారు. తెలంగాణ రైతాంగానికి సాగునీటి భద్రత కల్పిస్తూ, రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

**మహిళా సంఘాలకు గోదాములు**
మిల్లర్ల నుంచి ధాన్యం బకాయిలు వసూలు చేయాల్సిందేనని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం బకాయిల విలువకు సమానమైన సొమ్ము వసూలు చేయాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు.గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పును తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందన్న సీఎం, ప్రతీ ధాన్యం గింజకు సంబంధించిన బకాయి వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలు కోసం విధివిధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాలపై మంత్రివర్గ ఉప సంఘం చర్చించి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు.మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతీ సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్నందున ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను (మిగతా 3లో)

## ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ మృతి

**బంధువుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు**




**టి మీడియా, ఆగస్టు 12, ఎల్బీనగర్ :**
మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. 2024 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ సాయికుమార్ రాత్రి విధుల్లో ఉండి, ఠాణాలోని బాత్‌రూంలో తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కానిస్టేబుల్ ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.
హస్పిటల్‌కు తీసుకెళ్లే సరికే తెల్లవారు జామున 2.30 గంటలకు ఘటన జరిగినట్లు పోలీస్ సిబ్బంది చెబుతున్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడనే విషయాన్ని తెలుసుకున్న వెంటనే, తోటి సిబ్బంది అతనిని ముందుగా కామినేని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సాయికుమార్ మృతిచెందినట్లు నిర్ధారించారు. (మిగతా 2లో)

## ప్రజ్వల్ రేవణ్ణ బ్యారక్‌లో సెల్‌ఫోన్

**● అసిస్టెంట్ సూపరింటెండెంట్‌పై వేటు**

**టి మీడియా, ఆగస్టు 12,బెంగూళురు :**
రేప్ కేసులో అరెస్టై బెంగూళురులోని సెంట్రల్ జైలులో ఉన్న ప్రజ్వల్ రేవణ్ణ బ్యారక్ నుంచి ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు కర్ణాటక జైళ్ల శాఖ డీజీ అలోక్ కుమార్ తెలిపారు. జైలులో ఆగస్టు 11న సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ నిర్వహించిన సోదాల్లో ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పరప్పన అగ్రహార పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ బ్రాంచ్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోందని అలోక్ కుమార్ చెప్పారు. ఒక పెన్ డ్రైవ్ కూడా రేవణ్ణ వద్ద దొరికినట్లు ప్రచారం జరిగినా అధికారంగా వెల్లడించలేదు. మరోవైపు, ఈ ఘటనలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు అసిస్టెంట్ (మిగతా 2లో)




# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



**● సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

**టి మీడియా, ఆగస్టు 12, అమరావతి బ్యూరో :**
శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీస్ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. సైబర్ క్రైమ్, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పోలీసులను ఆదేశించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ఫేక్ ప్రచారాన్ని కట్టడి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఎం స్పష్టం చేశారు.అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. డీజీపీ నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు రాష్ట్రవ్యాప్తంగా 1,650 మంది పోలీసు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.అలాగే రేంజ్ ఐజీలు, డీఐజీలు, జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు వర్చువల్‌గా సమీక్షలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,200కు పైగా పోలీస్ స్టేషన్ల నుంచి ఎస్‌హెచ్‌వోలు సహా అధికారులు సమావేశానికి హాజరయ్యారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులను సమీక్షిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠినంగా వ్యవహరించాలని చంద్రబాబు ఆదేశించారు.

**గొడ్డలి పార్టీ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలి**
మరోవైపు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. మంత్రులతో వివిధ అంశాలపై చర్చించారు. "అర్హత లేకున్నా గొడ్డలి పార్టీ జాబ్‌లు ఇచ్చింది. వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 అక్రమాలే ఒక ఉదాహరణ. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఎంతో ద్రోహం చేశారు. కోర్టుకు సిట్ సమర్పించిన నివేదిక చూస్తే గ్రూప్-1 అక్రమాలు తెలుస్తాయి. ఎప్పుడూ ఇంత దారుణంగా జవాబుపత్రాల మూల్యాంకనం జరగలేదు. సిట్ హైకోర్టుకు సమర్పించిన నివేదికను ప్రతిఒక్కరూ చూడాలి. నిరుద్యోగులకు చేసిన మోసంపై గొడ్డలి పార్టీని ప్రతిఒక్కరూ నిలదీయాలి. ద్రోహాన్ని కప్పిపుచ్చుకుంటూ డీఎస్సీపై విషం కక్కుతున్నారు. డీఎస్సీపై చేసిన ప్రతి విమర్శనూ గట్టిగానే తిప్పికొట్టాం. గొడ్డలి పార్టీ కుట్రలను ప్రతి ఒక్కరూ దీటుగా తిప్పికొట్టాలి" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**సీఎం సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్‌కు ప్రెసిడెంట్ అవార్డు**
ముఖ్యమంత్రి సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ భద్రయ్యకు ప్రెసిడెంట్ పోలీసు అవార్డ్ (మిగతా 2లో)

# సెప్టెంబర్ 3న ఫొటో ఎలక్టోరల్ రోల్స్ ప్రకటన

**● వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల సంఘం**

**టి మీడియా, ఆగస్టు 12, అమరావతి బ్యూరో :**
ఏపీలో సెప్టెంబర్? 3న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయితీల్లో ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్?ను ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహించినా సన్నద్ధంగా ఉండాలని ఆయా ఉన్నతాధికార్లను, జిల్లాల యంత్రాంగాలను ఎన్నికల సంఘం సమాయుత్తం చేస్తోంది.ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మున్సిపల్, పంచాయితీ రాజ్ శాఖల కార్యదర్శుల స్థాయిలో ఒక విడత సమావేశం జరిగింది. ఆ తర్వాత పలు సమావేశాలను నిర్వహిస్తోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనిస్తూ (మిగతా 2లో)



# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

● **కేంద్ర మంత్రికి పొంగులేటి వినతి**

**టి మీడియా, ఆగస్టు 12, ఢిల్లీ బ్యూరో :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా గుర్తుచేసిన ఆయన, రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



**ఏడాది క్రితమే సర్వే పూర్తి.. మంజూరులోనే జాప్యం**

రాష్ట్రవ్యాప్తంగా ఆవాస్ ప్లస్--2024 యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు.

**ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం**

పామి-జి కింద ఇచ్చే కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు.

**తెలంగాణ పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానం**

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు.

# జూనియర్ కళాశాలలో 'స్వచ్ఛత పక్వాడ'




**టీ మీడియా ఆగస్టు 12ముదిగొండ :** ఖమ్మం జిల్లా మేరా యువ భారత్ మరియు ప్రజ్వల యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ముదిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 'స్వచ్ఛత పక్వాడ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన అధికారి ఏం. రాంబాబు ఆదేశాల మేరకు, అకౌంట్స్ అధికారి కే. భానుచందర్ గారి సహకారంతో ఈ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా కళాశాల పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం యువతీ యువకులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎస్ఐ జి. హరిత మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మల్లిక , మై భారత్ వాలంటీర్ గుడిమల్లం మాధురి, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

**ఎల్బీనగర్ ఏసీపీ ఆఫీసులోవిధులు**

2024లో కానిస్టేబుల్? ఉద్యోగానికి ఎంపికైన సాయికుమార్ ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఎల్బీనగర్‌కు సమీపంలోని కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నారు.

**పోలీసులతో వాగ్వాదం**

కానిస్టేబుల్ సాయికుమార్ మృతి వార్త విన్న బంధువులు, వివిధ సంఘాల నేతలు పోలీస్?స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని తమకు చూపించకుండానే పోస్టుమార్టం కోసం ఎందుకు తరలించారని, సాయికుమార్ కుటుంబ సభ్యులు పోలీసులను నిలదీశారు. ఎల్బీనగర్? పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఠాణాలోని ఫర్నిచర్, కంప్యూటర్, ప్రింటర్?లను ధ్వంసం చేశారు.సాయికుమార్ ఆత్మహత్య చేసుకోలేదని బంధువులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకుంటే రక్తపు మరకలు ఎందుకున్నాయని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ అనురాధ పరిశీలించారు. పీఎస్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు.మృతుడు సాయికుమార్?ది రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బండాలేమూరు గ్రామం. రెక్కల కష్టంతో చదివిస్తే ఉద్యోగం సాధించిన ఆనందం కొద్ది రోజుల్లోనే అడియాశలు అయిపోయాయని మృతుడి తల్లి విజయ, తండ్రి బోడియా ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోవాల్సిన కష్టం ఎందుకొచ్చిందని?, ఎలాంటి ఇబ్బంది పెట్టి ఉంటారో? అని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీఐ తన కొడుకుని చంపాడని తల్లి విజయ ఆరోపించారు.

కానిస్టేబుల్ సాయి స్వగ్రామం మంచాల మండలంలోని బండలేమూరు కావడంతో అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా ఎల్బీనగర్ పీఎస్‌కు చేరుకున్నారు. బాధిత కుటుంబంతో మాట్లాడారు. బంధువులతో కలిసి స్థానిక నేతలు పోలీస్? స్టేషన్ ముందు బైఠాయించారు. సీపీ రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

లభించింది. భద్రయ్య ఎస్పీ ర్యాంక్ పోలీస్ ఉన్నతాధికారి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చేతుల మీదుగా భద్రయ్యకు ప్రెసిడెంట్ పోలీసు అవార్డ్ ప్రదానం చేయనున్నారు. 35 ఏళ్లకు పైగా పోలీసు సేవలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రస్తుతం ఏపీ స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీగా భద్రయ్య కొనసాగుతున్నారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో 23 ఏళ్లు పనిచేసి వీఐపీ భద్రతలో ప్రత్యేక అనుభవం పొందారు.

## సెప్టెంబర్ 3న ఫొటో ఎలక్టోరల్ రోల్స్ ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)ద

పంచాయతీలు, మున్సిపాల్టీల్లో ఎన్నికల ప్రక్రియను ఎప్పుడు ప్రారంభించాల్సి వచ్చినా సిద్ధంగా ఉండేట్టుగా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే తొలి అడుగుగా ఓటర్ల జాబితాల ప్రకటన చేయనుంది.ఈ క్రమంలో 20 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్ ఈనెల 17న ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునేఠా ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లోనూ పోలింగ్ స్టేషన్ల ప్రకటన ఈనెల 21నుంచి ఆరంభమై 31 వరకు కొనసాగుతుందని ఆయన వివరించారు. దాదాపు ఏపీలో ఉన్న 13,000లకు పైగా గ్రామపంచాయతీలు, వందకుపైగా మున్సిపల్ సంస్థలకు సంబందించిన ఫొటో ఓటర్ల జాబితాల ప్రకటనతో ఈ ఎన్నికల సమరానికి నాంది కానుంది.

# ప్రజ్వల్ రేవణ్ణ బ్యారక్‌లో సెల్‌ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

సూపరింటెండెంట్ ఈరన్న రంగాపుర్‌ను సస్పెండ్ చేశారు. అలాగే, విషయంపై వివరణ ఇవ్వాలని బెంగళూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

**తనిఖీల్లో 10 ఫోన్‌లు స్వాధీనం**

వాస్తవానికి జైలులో అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఆగస్టు 6 తేదీనే ప్రజ్వల్? రేవణ్ణ బ్యారక్?ను జైలు అధికారులు తనిఖీ చేశారు. అయితే, ఆ సమయంలో ఎలాంటి నిషేధిత వస్తువులు దొరకలేదు. దీంతో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) అధికారుల బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించింది. మధ్యాహ్నం సుమారు 1 గంటకు, సీసీబీ డీసీపీ హరిబాబు, రాజా ఇమామ్ ఖాసింల నేతృత్వంలో 80 మందికి పైగా సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రాత్రి వరకు జైలులోని ప్రతి బ్యారక్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో 10కి పైగా మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరి వద్ద నిషేధిత వస్తువులు ఉన్నట్లు గుర్తించినట్లు సీసీబీ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై సీసీబీ అధికారులు పరప్పన అగ్రహార పోలీస్? స్టేషన్? ఫిర్యాదు నమోదు చేశారు. జైలులోకి మొబైల్? ఫోన్? ఎలా చేరింది? దీని వెనుక ఎవరి హస్తం ఉంది? అనే కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని అలోక్? కుమార్ తెలిపారు.

**ఆ ఫోను, ఛార్జర్ నావే!?**



మరోవైపు, సీసీబీ అధికారుల ఫిర్యాదు ఆధారంగా, జైలు బ్యారక్?లో లభించిన మొబైల్?, ఛార్జర్?, పెన్?డ్రైవ్? తనవేనని జైలులో ఉన్న మరో ఖైదీ ప్రతాప్? రాయ్?అంగీకరించాడు. తన వద్ద నుంచే ప్రజ్వల్? ఫోన్? తీసుకుని అప్పుడప్పుడు తన బంధువులు, న్యాయవాదులతో మాట్లాడేవాడని ప్రతాప్? చెప్పాడు. స్వాధీనం చేసుకున్న ఫోన్?లో వాట్సాప్, ఫేస్?బుక్?, ఇన్?స్టాగ్రామ్?, నెట్?ఫ్లిక్స్?, ప్రైమ్? వీడియో వంటి యాప్?లు ఉన్నాయి. అయితే, వాటన్నింటికీ పాస్?వర్డ్? ఉండటంతో దాని గురించి అడిగినప్పుడు ఇద్దరు ఖైదీలు తమకు తెలియదని సమాధానం చెప్పడం గమనార్హం.

**అసలేంటి ఈ కేసు?**

ఇదిలా ఉండగా, మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడైన ఎణ రేవణ్ణ కుమారుడే ప్రజ్వల్ రేవణ్ణ. లైంగిక దాడి కేసుల్లో ప్రజ్వల్‌ను 2024 మేలో అరెస్టు చేశారు. ఒక అత్యాచారం కేసులో ప్రజ్వల్‌ను దోషిగా తేల్చిన కోర్టు జీవిత ఖైదు విధించింది. ప్రస్తుతం ఆయన పరప్పన అగ్రహార జైలులో శిక్షను అనుభవిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో హాసన సెక్స్ కుంభకోణం కర్ణాటకలో ప్రకంపనలు సృష్టించింది. ఆ సమయంలో, తన తల్లిపై కొన్నేళ్ల క్రితం ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ ఓ మహిళ షాకింగ్ విషయాలు వెల్లడించింది. బెంగళూరులోని నివాసంలో ఈ దాడికి పాల్పడినట్లు సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలాన్ని ఇచ్చింది. అనంతరం పలువురు మహిళలు కూడా ఆయనపై ఆరోపణలు చేయడంతో ఆయనపై కేసు నమోదు చేశారు అధికారులు. విచారణలో ప్రజ్వల్ దోషిగా తేలడంతో కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది.

# నల్గొండలో విషాదం

## బిడ్డకు జన్మనిచ్చి ఆత్మహత్య చేసుకున్న తల్లి



**టి మీడియా, ఆగస్టు 12, నల్గొండ:** జిల్లా ప్రభుత్వాస్పత్రిలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి, వారం రోజులకే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటివరకు మంచిగా ఉండి ఒక్కసారి ఆత్మహత్య చేసుకోవటంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలోనే ఈ దారుణం జరగడం పట్ల ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తల్లి ఆత్మహత్యకు కారణం తెలుసుకునేందుకు వైద్యారోగ్యశాఖ ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీని నియమించింది.

కాన్పు కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, నల్గొండ జిల్లా మునుగోడు మండలం చీకటి మామిడికి చెందిన రమేశ్, మమత దంపతులకు ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. నాలుగోసారి గర్భిణిగా ఉన్న మమత కాన్పు కోసం ఈనెల 3న జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చింది. 4వ తేదీన రాత్రి 10:38 నిమిషాలకు వైద్యులు ఆపరేషన్ చేయగా, మమత పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు ఆరోగ్యం దృష్ట్యా ఆస్పత్రిలోని పిల్లల విభాగంలో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాలింతల వార్డులో మమత, ఆమె వెంట సహాయకులు ఉన్నారు. వారం రోజులుగా డాక్టర్లు చెప్పిన సమయానికి బాబుకు పాలిచ్చి, మమత తిరిగి తన వార్డుకి వెళ్లిపోయేది.

ఘటన వెలుగులోకి వచ్చింది ఇలా మంగళవారం అర్ధరాత్రి రెండు గంటలకు వార్డు నుంచి మమత బయటకు వచ్చింది. వస్తూనే తన వెంట చీర తెచ్చుకుంది. నేరుగా పోస్టుమార్టం గది వైపునకు వెళ్లి అక్కడ ఉన్న నీటి ట్యాంకు స్టాండ్?కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బెడ్?పై మమత లేదన్న విషయం గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రి ఆవరణతో పాటు జిల్లా పరిసర ప్రాంతాల్లోనూ వెతికారు. తెల్లవారిన తర్వాత మార్చురీ గది వైపు వెళ్లారు. అక్కడ పరిస్థితిని చూసి వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.

**పాల కోసం శిశువు ఏడుపు**

ఆడాక్టర్లు చెప్పిన సమయానికి రోజు బిడ్డకు పాలిచ్చే తల్లి లేకపోవడంతో కుమారుడు పాల కోసం ఏడవడాన్ని చూసి అక్కడున్నవారు కన్నీటిపర్యంతమయ్యారు. అక్కడే ఉన్న ఇతర బాలింతలు వంతులవారీగా శిశువుకు పాలిచ్చి ఆకలి తీర్చారు. రాత్రి విధుల్లో ఉన్న ఆస్పత్రి సిబ్బంది, సెక్యూరిటీ అప్రమత్తంగా ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు ప్రారంభించారు.

**విచారణ కమిటీ ఏర్పాటు**

ఆస్పత్రి ఆవరణలోనే బాలింత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేసింది. 24 గంటల్లోగా మమత ఆత్మహత్య కేసులో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. విచారణ కమిటీలో ఆప్తమాలజీ హెచ్‌వోడీ డాక్టర్ మోదినీ, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ వెంకట నాగరాజు, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ స్వరూపరాణి, ఆర్ఎంవో అరుంధతి, నర్సింగ్ సూపరింటెండెంట్ నీలాబాయి ఉన్నారు.

**వైద్యారోగ్యశాఖ డీఎంఈ వాణి ఘటనపై ఆరా**

హైదరాబాద్ నుంచి నల్గొండ ప్రభుత్వాస్పత్రికి వచ్చిన వైద్యారోగ్యశాఖ డీఎంఈ వాణి ఘటనపై ఆరా తీశారు. రాత్రి విధుల్లో ఉన్న భద్రతా సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు, ఇతర అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. పోయిన ప్రాణాన్ని తీసుకురాగలమా అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను సందర్శించిన వాణి ఆస్పత్రి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అందించే సేవలు మెరుగుపర్చాలని సూచించారు. రోగులు, సహాయకులకు అందించే భోజనంలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

# జూనియర్ డాక్టర్ల ఆందోళన

● **సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**టి మీడియా, ఆగస్టు 12,తిరుపతి :** ఎన్నికల హామీ మేరకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జూనియర్ వైద్యులు ఆందోళన బాట పట్టారు. తిరుపతిలో విద్యార్థులు రుయా ఆస్పత్రి నుంచి ఎస్వీ మెడికల్? కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఓపీడీ, వార్డు డ్యూటీలను బహిష్కరించినట్లు జూనియర్ వైద్యులు తెలిపారు.రెండో రోజుకు చేరిన జూనియర్ డాక్టర్ల సమ్మె కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్)లో జూనియర్ డాక్టర్ల (జూడాలు) సమ్మె రెండో రోజుకు చేరింది. ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) పిలుపు మేరకు బుధవారం సైతం వైద్యులు విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ ఆసుపత్రి ప్రాంగణంలో నినాదాలు చేశారు.అత్యవసర చికిత్స విధులు నిర్వహిస్తూనే ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామని జూనియర్ వైద్యులు తెలిపారు. తమకు ఇస్తామన్న స్టైఫండ్ పెంచాలని వారు డిమాండ్ చేశారు. జూడాలకు మెరుగైన వసతులు, కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మితిమీరిన పనిభారాన్ని తగ్గించి, పనిగంటలు తగ్గించాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచడం వల్ల కొత్తగా వచ్చే డాక్టర్లకు అవకాశాలు పూర్తిగా తగ్గుతాయన్నారు. ఈ సమ్మెకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ కూడా సంఘీభావాన్ని ప్రకటించింది. జూనియర్ డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని అనంతపురంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జూనియర్ డాక్టర్లు నిరసన చేపట్టారు. బైఠాయించి ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. 15 శాతం స్టైఫండ్ అమలు చేస్తామని జీవో ఇచ్చినప్పటికీ, అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. పనులు చేస్తున్న తమకు ప్రతిఫలం లేకుండా పోయిందని డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్నా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడం లేదన్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ చేస్తున్న ఈ న్యాయపోరాటానికి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించింది. ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్చలు జరపాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధులు హెచ్చరించారు.

# నవీన్‌కు కన్నీటి వీడ్కోలు

⏭ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

⏭ నివాళులర్పించిన కలెక్టర్, డీఎఫ్‌వో,ఎమ్మెల్యే



**టీ మీడియా,ఆగస్ట్12,సింగరేణి(కారేపల్లి):** వన్యప్రాణుల వేటను అడ్డుకునేందుకు వెళ్లి, వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి విధి నిర్వహణలో మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ అంత్యక్రియలు బుధవారం సింగరేణి మండలం వెంకట్యాతండాలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు.కుటుంబ సభ్యులు,బంధువులు,అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు,రాజకీయ పార్టీల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై నవీన్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.సింగరేణి మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్,వెంకట్యాతండా సర్పంచ్ బానోత్ బాలీల చిన్న కుమారుడైన నవీన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రేంజ్ పరిధిలోని చెరువు సింగారం వెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.రెండు నెలల క్రితమే అక్కడికి బదిలీపై వెళ్లిన నవీన్ విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన మృతితో వెంకట్యాతండాతో పాటు సింగరేణి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నవీన్ మృతదేహాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్,వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సందర్శించి పుష్పాంజలి ఘటించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.ప్రభుత్వం,అటవీ శాఖ ద్వారా కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు.విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీని నవీన్ కుటుంబానికి అమలు చేయాలని కుటుంబ సభ్యులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కోరారు.కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు అటవీ శాఖ నుంచి రావాల్సిన అన్ని ప్రయోజనాలను ఆలస్యం లేకుండా అందించాలని విజ్ఞప్తి చేశారు.

**కారేపల్లిలో భారీ ఊరేగింపు**

భద్రాచలం నుంచి నవీన్ మృతదేహాన్ని స్వగ్రామమైన వెంకట్యాతండాకు తీసుకువస్తున్న సందర్భంగా కారేపల్లిలో భారీ ఊరేగింపు నిర్వహించారు.నవీన్ మృతదేహం కారేపల్లికి చేరుకోగానే పెద్ద సంఖ్యలో యువకులు, స్నేహితులు,స్థానికులు తరలివచ్చారు. ఊరేగింపులో పాల్గొని తమ మిత్రుడికి కన్నీటి నివాళులర్పించారు.భద్రాచలం ఆసుపత్రిలో నవీన్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నవీన్ మృతదేహానికి వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి,సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,కాంగ్రెస్ జిల్లా నాయకురాలు పగడాల మంజుల, సింగరేణి మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు,అడ్డగోడ ఐలయ్య,పెద్దబోయిన ఉమాశంకర్,గుడిపూడి తిరుమలరావు,గుగులోత్ భీముడు,కడియాల సుధాకర్,ఈసాల నాగేశ్వరరావు,వాంకుడోత్ గోపాల్ నివాళులర్పించారు. అలాగే సర్పంచ్‌లు భూక్య రంజిత్,బానోత్ హీరాలాల్,మేదరి వీరప్రతాప్,పొడుగు పెంటయ్య,ఈసాల వెంకటేశ్వర్లు, కల్తి భద్రయ్య, దారావత్ మంగీలాల్, బీఆర్ఎస్ నాయకులు ముత్యాల సత్యనారాయణ, అడపా పుల్లారావు,లాకావత్ లక్ష్మన్, వాంకుడోత్ జగన్,సీపీఎం నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు,కె.నరేంద్ర, తలారి దేవప్రకాష్, రేగళ్ల మంగయ్య,కేశగాని ఉపేందర్ తదితరులు నవీన్‌కు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు



**టీ మీడియా, ఆగస్టు 12 పెబ్బేరు:** పెబ్బేరు పట్టణంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో జయంతి వేడుకలు కృష్ణ యాదవ సంఘం తోగుట వీర క్షత్రియ సంఘం యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ పూజారి చంద్రయ్య అర్చకులు గోపి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమార్చన అభిషేకాలు నిర్వహించి మహా మంగళహారతి సమర్పించారు జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది డోలు వాయిద్యాల నడుమ సిగసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో కృష్ణ యాదవ సంఘం యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు అమ్మవారి జయంతి వేడుకలతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారింది.

# అర్ ఎస్ ఎస్ శత జయంతి వేడుకల్లో యువ సమ్మేళనం



**టీ మీడియా, ఆగస్టు 12 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని వల్లపు రెడ్డి ఫంక్షన్ హాల్ లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా రావుల రవీంద్రనాథ్ రెడ్డి అప్పల ప్రసాద్ పాల్గొన్నారు యువ సమ్మేళనంలో భాగంగా వక్తలుగా మాట్లాడుతూ యువత రాష్ట్రాన్ని సంఘటితంగా ప్రగతి పథం వైపు ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతా యుతంగా దేశ భక్తి క్రమ శిక్షణా సేవా భావంతో ముందుకు వెళ్లాలని ఒక లక్ష్యంతో చదువుపై దృష్టి పెట్టాలని ఉన్నత స్థాయిలకు ఎదగాలని చెడు అలవాట్లు కు దూరంగా ఉండాలనీ స్వామి వివేకానంద ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ నిర్మాణంలో యువత ముందుండి నడిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో విద్యార్థి విద్యార్థినులు యువత అర్ ఎస్ ఎస్ కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

⏭ ప్రత్యేక అధికారి సునీల్ కుమార్




**టీ మీడియా ,ఆగస్టు 12,కూసుమంచి:** ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన అందరికీ అందాలనీ, అందుకు బాధ్యత గల ప్రతి ఒక్కరు విధిగా పారదర్శకతతో పనిచేయాలని కూసుమంచి మండలం ప్రత్యేక అధికారి సునీల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఎం పీ డీ వో కార్యాలయం సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన కూసుమంచి మండల ప్రజా పరిషత్ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక నూతన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు. పల్లె గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీలకు నిధులు విడుదల చేస్తూ ప్రజల కు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. ప్రజల మౌలిక వసతులు అయిన త్రాగునీరు, పారిశుద్ధ్యం, సిసి రోడ్ల నిర్మాణం తో పాటు, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, వంటి తదితర అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ , అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుందని ఆయన చెప్పారు. అయితే ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేందుకు ప్రజాప్రతినిధులు భాగస్వాములై వారి సంక్షేమం కోసం కృషి చేయాలని సునీల్ కుమార్ కోరారు. కూసుమంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాటిపాముల జస్వంత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల మౌలిక వసతులు, సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వ బాధ్యులతోపాటు ప్రజా ప్రతినిధులు ఉమ్మడి కృషి చేయాలన్నారు. ప్రధానంగా 6 అంశాలపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన క్లుప్తంగా మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నందున భూగర్భ జలాల పెంపుకు జలసిరి ద్వారా ప్రజలు ఇళ్లల్లో ఇంకుడు గుంటలు, రైతులు పంట కుంటలు నిర్మించుకోవాలని సూచిస్తూ, అందుకు వి బి జి, రాంజీ పథకం ద్వారా లబ్ధిదారులకు ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే 16వ ఆర్థిక సంఘం గ్రాంట్ల నిధుల వినియోగం చేయు విధానం, గ్రామపంచాయతీలకు సొంత ఆదాయం సమకూర్చుకోను వనరులు, వీధి కుక్కల నిర్మూలన ఏ బి సి ఏర్పాటు మంకీ సమస్య తదితర వాటి సమస్యల పరిష్కారం గురించి ఆయన వివరించారు. కుసుమంచి తహసిల్దార్ సైదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి తో అంగుళం భూమి కూడా తగ్గకుండా రి సర్వే తో ఖచ్చితమైన భూమి కొలతకు వస్తుందని , దాంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గురువాయిగూడెం గ్రామ సర్పంచి బిక్షం తన గ్రామంలో నిర్మించిన భవనము బిల్లు కొరకు ప్రజాదర్బార్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు పరిష్కారం కాలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే భగత్ వీడు సర్పంచి భూక్య వసంత లక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రభుత్వ భూములు కొందరు సబ్జా చేసినట్లు, తిరిగి రీ సర్వేలో అట్టి భూమిని గుర్తించి , తీసుకోవాలని అధికారులను సభాముఖంగా కోరారు .అలాగే సభలో పలువురు సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలపై అధికారుల దృష్టికి సభాముఖంగా తీసుకొచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి, వ్యవసాయ అధికారి వాణి, ఏపీవో అప్పారావు, సి డి పి ఓ కవిత, ఈ సి కరుణ, వైద్యాధికారి, తదితరులు తమ శాఖల నివేదికను సభాముఖంగా వినిపించారు. ఈ సమీక్ష సమావేశంలో కోక్య తండా సర్పంచ్ ,హాలావతు వీరయ్య, పాలేరు గ్రామ సర్పంచ్ బానోతు నాగేశ్వరరావు, మల్లాయగూడెం సర్పంచ్ బాదావత్తు నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు కొలిశెట్టి శ్రీను, సతీష్, బొంగ నాయక్, కిరణ్ మై తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలి



**టీ మీడియా ఆగస్టు 12ముదిగొండ :** వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు సాధించాలని అశ్వారావుపేట వ్యవసాయ కళశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె హేమంత కుమార్సూచించారు. ముదిగొండ మండలం మేడేపల్లి, వెంకటాపురం, ముదిగొండ గ్రామపంచాయతీ, జిల్లా పర్షత్ ఉన్నత పాఠశాలల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సును నిర్వహించారు. విద్యార్థులు రైతులకు వివిధ చిత్రపటాలు,వెన్ డయాగ్రామ్‌ల ద్వారా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో విద్యార్థులు వివిధ పంటల పై పరిశోధనలు చేశారు. రైతులు తక్కువ పెట్టుబడి, నీటిని వినియోగిస్తూ ఎక్కువ దిగుబడులు ఎలా సాధించాలో అవగాహన కల్పించారు. పంటల మార్పిడి, క్రిమి సంహారక, రసాయన ఎరువుల వాడకంలో మోతాదులు, పంటల కాలంలో వచ్చే చీడపీడలు వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గ్రామల స్వరూపం, సామాజిక వనరుల గురించి చిత్రపటాలు వేసి రైతులకు ప్రదర్శించారు. సేంద్రియ ఎరువుల వాడడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఉత్తమ యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించి వారు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కట్టకూరు ఉపేందర్, చెరుకుపల్లి జగన్నాధం,కందుల బాల్చందర్ అసోసియేట్ డీన్ డాక్టర్ జె హేమంత కుమార్, శాస్త్రవేత్తలు నాగంజలి,కీర్తి, పావని. కళాశాల విద్యార్థులు కీర్తి, శృతి,వర్షతా, అనూష, రక్షిత,సాత్విక పాల్గొన్నారు.

# సమస్యలపై స్పందించి చర్యలు చేపట్టాలి



**టీ మీడియా, ఆగస్టు 12, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మునిసిపాలిటీలో రోడ్లు, పారిశుధ్యం,దోమల బెడద, స్ట్రీట్ లైట్లు, పశువులు/కుక్కలు/కోతుల బెడద, రహదారి భద్రత వంటి సమస్యలపై తక్షణ చర్యలు కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆర్కెపి పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ మునిసిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు.వర్షాకాలంలో ఫాగింగ్, కాల్వల శుభ్రత, గుంతలు పూడ్చడం, లైట్లు మరమ్మతు, ప్రమాద సూచికలు,జంతువుల నియంత్రణ వంటి డిమాండ్లు చేశారు.ప్రత్యేకంగా శ్రీనివాస గార్డెన్ నుంచి ఎమ్మెన్నార్ గార్డెన్ వరకు జంక్షన్ లో వద్ద ముందుగా ప్రమాద సూచిక రిఫ్లెక్టివ్ సైన్స్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.కమిషనర్ మురళీకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్, మాజీ కౌన్సిలర్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# 5 నియోజకవర్గాల్లో మహిళా సంఘాల గోదాములు

(మొదటి పేజీ తరువాయి)

పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు సైలో బ్యాగ్ నిర్మాణాల కోసం నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలిపారు. దీనిపై రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్‌లో ఉన్న గోడౌన్‌లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మహిళ సంఘాలకు గోదాములు నిర్మించాలన్న సీఎం, పైలట్ ప్రాజెక్టుగా 5 నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు గోదాములు నిర్మించాలన్నారు.వీబీజీరామ్?జీలో ఫ్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు శేషాద్రి, స్టీఫెన్ రవీంద్ర, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధి తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ నిర్మాణానికి స్పందించిన మంత్రి



**టి మీడియా, ఆగస్టు 12,ఆత్మకూరు :** వనపర్తి జిల్లా ఆత్మకూరు లో నూతన బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రమంత్రి వర్యులు వాకిటి శ్రీహరి అన్న సమక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కి వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు. ఈ వినతిని పరిశీలించిన మంత్రి వెంటనే సానుకూలంగా స్పందించి, నూతన బస్టాండ్ నిర్మాణానికి అతి త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.డి. రహమతుల్లా ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అక్షర మహేష్ ,కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీను ,దామోదర్ , అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

**⏭ అక్రమ వేటగాళ్లపై ఉక్కుపాదం మోపాలి**

**⏭ అటవీ సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి**

**⏭ ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన నాయకుడు అజ్మీరా వీరన్న**



**టీ మీడియా,ఆగస్ట్12,సింగరేణి(కారేపల్లి):** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అధికారి బానోత్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన నాయకుడు అజ్మీరా వీరన్న డిమాండ్ చేశారు.నవీన్ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ప్రకటించడంతో పాటు ఆయన భార్యకు అర్హతకు తగిన ప్రభుత్వ ఉద్యోగం,పిల్లలకు కార్పొరేట్ ప్రమాణాలతో ఉచిత విద్య కల్పించాలని కోరారు.జిల్లా కేంద్రంలో అనువైన ఇంటి స్థలం కేటాయించి,ప్రభుత్వ సంక్షేమ సదుపాయాలన్నీ అందించాలని అన్నారు.

అడవులు,వన్యప్రాణులను కాపాడే క్రమంలో అటవీ సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని,ముఖ్యంగా రాత్రివేళల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక భద్రత కల్పించాలని వీరన్న కోరారు.అవసరమైన రక్షణ పరికరాలు,పోలీసు బలగాల సహకారం అందించడంతో పాటు అటవీ సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.విద్యుత్ తీగలు,ఉచ్చులు ఏర్పాటు చేసి వన్యప్రాణులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అక్రమ వేట సామగ్రిని స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టప్రకారం నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు.ఒక నవీన్‌ను కోల్పోయిన తర్వాత మరో అటవీ ఉద్యోగి కుటుంబం కన్నీరు పెట్టుకునే పరిస్థితి రాకుండా ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని వీరన్న అన్నారు.నవీన్ కుటుంబానికి న్యాయం చేయడం కేవలం పరిహారంతో పూర్తికాదని,అటవీ సిబ్బందికి శాశ్వత భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు అక్రమ వేటకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని వీరన్న డిమాండ్ చేశారు.

## అయ్యో అనిత.. మరికాసేపట్లో డెలివరీ





**⏭ అంతలోనే వైద్యులు వచ్చి ఏం చెప్పారంటే..**

**టి మీడియా, ఆగస్టు 12, సంగారెడ్డి :** జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని మృతురాలి బంధువుల ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.. బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా చేపట్టారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన అనిత అనే గర్భిణి.. ఈ నెల 10వ తేదీన కాన్పు కోసం సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. ఈరోజు ఉదయం ఆమెకు డెలివరీ చేయాల్సి ఉండగా.. అనిత మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వారు బంధువులకు సమాచారం ఇవ్వడంతో.. పెద్ద ఎత్తున ఆస్పత్రి దగ్గరకు చేరుకుని.. వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు సకాలంలో స్పందించకపోవడం, వారి నిర్లక్ష్యం కారణంగానే అనిత ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధ్యులైన డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి గేటు ముందు బైఠాయించి నిరసనకు దిగారు.బాధితుల ఆందోళనతో ఆస్పత్రి ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కాగా.. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం..

## ఇష్టారాజ్యంగా ఔషధ దుకాణాల నిర్వహణ

**⏭ ఫార్మసిస్టులు లేకుండానే అమ్మకాలు**



**టి మీడియా, ఆగస్టు 12, హైదరాబాద్ బ్యూరో:** ఆరోగ్యం బాగుపడాలంటే ఔషధాలను నిర్ణీత మోతాదులో తగిన సందర్భాల్లో వినియోగించాలి. శిక్షణ పొందిన వైద్యుల సిఫార్సుకు అనుగుణంగా ఇది ఉండాలి. కానీ కొన్ని మందుల దుకాణాల్లో అమ్మకాలు ఇష్టారీతిన సాగుతున్నాయి.

**ఫార్మసిస్టులు లేకుండానే మందుల దుకాణాలు**

మందుల దుకాణంలో ఫార్మసిస్టు ఉండాలనేది నిబంధన. కానీ చాలావరకు ఇది అమలవడం లేదు. ఫార్మసీ పూర్తిచేసిన వారి సర్టిఫికేట్ ఉపయోగించి, ఇతర వ్యక్తులు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. మందుల అమ్మకాలను హెచ్?–1 రిజిస్టర్లలో నమోదు చేయాలన్న విషయాన్నీ విస్మరిస్తున్నారు. గడువు దగ్గరపడిన మందులను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ తొలగిస్తూ ఉండాలి.

ఆర్‌ఎంపీలు చెప్పారనో, తెలిసిన వారు అడిగారనో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో మందుల విక్రయాలు జరుగుతున్నాయి. మరోవైపు గర్భవిచ్ఛిత్తి మందులను గుట్టుగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.డాక్టర్ల సిఫార్సుకు అనుగుణంగానే యాంటీబయాటిక్? మందులు వాడాలి. కానీ కొందరు అత్యుత్సాహంతో నేరుగా వాటిని వాడుతున్నారు. దీంతో భవిష్యత్తులో అనారోగ్య సమస్యలొస్తాయి. అమ్మకాల సమయంలో కఠినంగా ఉండాల్సిన వ్యక్తులూ దాన్ని పట్టించుకోవడం లేదు.

**వ్యాపారంలో లాభాల కోసం ఇలా**

'మా వాళ్లకు రెండు రోజులుగా జ్వరం. ఒంటి నొప్పులు, ఏవైనా మందులివ్వండి' అంటూ మందుల దుకాణాలకు వెళ్తే అక్కడున్న వ్యక్తులు మందులను ఇచ్చేస్తున్నారు. అంతేకాదు వాటిని ఎలా వాడాలో చెప్పేస్తున్నారు. అలాగని వారేం శిక్షణ పొందినవారు కాదు. అనుభవంతోనే అలా చేసేస్తున్నారు. అది విషజ్వరమా, ఇంకేదైనా తీవ్రత ఉన్న అనారోగ్య సమస్యనా అని తెలుసుకోకుండా, ఎటువంటి పరీక్షలు లేకుండానే మందులు ఇచ్చేస్తారు. కొన్ని సందర్భాల్లో వీరిచ్చే మందులతో ఫలితం ఉండదు. పైపెచ్చు పరిస్థితి ఇంకాస్త తీవ్రమయ్యే అవకాశమూ లేకపోలేదు. కానీ, కొన్ని దుకాణాల్లో ఇవేవీ పట్టించుకోవడం లేదు. నేరుగా వెళ్లి అడిగినా, తెల్ల కాగితంపై రాసుకొని వెళ్లినా మందులు ఇచ్చేస్తున్నారు. గిరాకీ వచ్చింది, లాభం మిగులుతుందన్న భావనతోనే ఇలా వ్యవహరిస్తున్నారు.మెడికల్? హోల్?సేల్?, రిటైల్? మందుల దుకాణాలు, ఏజెన్సీల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపడుతూ అమ్మకాలను పర్యవేక్షించడం, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం ఔషధ నియంత్రణ శాఖ బాధ్యత. ఆదిలాబాద్? జిల్లాలో శాఖ పనితీరు విమర్శలకు కారణమవుతోంది. కేవలం ఇలా ఆరోపణలొచ్చినప్పుడు మినహా మిగతా సందర్భాల్లో తనిఖీలుండవనే విమర్శలున్నాయి. ఫిర్యాదు చేసేందుకు , సమాచారమిచ్చేందుకు ఫోన్? చేసినా స్పందించరనే భావన నెలకొంది. శాఖ కార్యాలయం పట్టణానికి దూరంగా ఉన్న కలెక్టరేట్?లో ఉండటమూ వీరికి కలిసొచ్చినట్లవుతోంది. జనం కూడా అంతదూరంరాలేకపోవడంతో వీరు కార్యాలయానికి వచ్చినా, రాకపోయినా ఫర్వాలేదన్న పరిస్థితి నెలకొంది.

**అర్హత లేని వారే ఎక్కువ :**

మెడికల్ దుకాణాలు ఔషధ నియంత్రణ శాఖ అనుమతి పొందిన తర్వాతే ఏర్పాటుచేసుకోవాలి. కానీ ఇటీవల మందుల దుకాణాల్లో అర్హత కలిగిన ఫార్మాసిస్టులు లేరు. ఎక్కువ చోట్ల పది, ఇంటర్? చదివిన వారే పనిచేస్తున్నారు. అయితే బీ, డీ ఫార్మసీ చదివిన వారికి ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందని వారిని నియమించుకోవడం లేదు. తక్కువ జీతానికి పని చేసేవారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. చాలాచోట్ల వినియోగదారులు అడిగిన యాంటీ బయాటిక్స్?, ఇతర మందులు ఇస్తున్నారు.

## ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

**⏭ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**టి మీడియా, ఆగస్టు 12, ఖమ్మం:** ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ఇండ్లు ఇండ్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, స్లాబ్ పనులు, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ తనిఖీ సందర్భంగా హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచంద్ర, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ ను చిదిమేసిన కామాంధుడు

**⏭ సంచలన తీర్పునిచ్చిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు**





**టి మీడియా, ఆగస్టు 12, మేడ్చల్:** నేరానికి ఒడిగడితే చట్టం ఉక్కుపాదం మోపుతుందనడానికి ఈ తీర్పు మరొక ప్రబల నిదర్శనం. బాలికలపై జరిగే అకృత్యాలు, వేధింపుల పట్ల న్యాయస్థానాలు ఎంత కఠినంగా వ్యవహరిస్తాయో హైదరాబాద్ మహానగరంలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు వెలువరించిన ఈ సంచలన తీర్పు స్పష్టం చేస్తోంది. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన తీవ్రమైన పోక్సో కేసులో నిందితుడిని దోషిగా తేలుస్తూ నేరెడ్‌మెట్ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. సమాజంలో మైనర్ పిల్లల భద్రతకు ముప్పుగా మారే ఇటువంటి వికృత మనస్తత్వ కలిగిన వ్యక్తులకు ఈ తీర్పు ఒక హెచ్చరిక.

మేడ్చల్ -- మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్ బొల్లిగూడెంలో నివాసముంటున్న పెయింటర్ కళా జాన్ (45) అనే వ్యక్తి ఒక మైనర్ బాలికపై దారుణానికి ఒడిగట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు పోక్సో చట్టంలోని కఠిన సెక్షన్ల ద్వారా కేసు నమోదు చేశారు. నేరెడ్‌మెట్‌లోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఈ కేసు విచారణను అత్యంత వేగవంతంగా పూర్తి చేసింది. పోలీసులు పక్కా ఆధారాలతో నేరాన్ని నిరూపించారు. నిందితుడి దారుణ వైఖరిని పరిగణనలోకి తీసుకుని, అతడికి 20 సంవత్సరాల కఠిన జైలు శిక్షతో పాటు, రూ. 2,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.బాధిత బాలిక భవిష్యత్తు, పునరావాసాన్ని దృష్టిలో ఉంచుకుని కోర్టు రూ. 3,00,000 పరిహారాన్ని కూడా మంజూరు చేసింది. కన్నపిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతైనా ఉందనడానికి, అలాగే చిన్నారుల పట్ల తప్పుగా ప్రవర్తించే వారికి చట్టం ముందు రక్షణ ఉండదని చెప్పడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం. పోలీసుల వేగవంతమైన దర్యాప్తు, న్యాయస్థానం ఇచ్చిన ఈ వేగవంతమైన కఠిన తీర్పు పట్ల ప్రజలు, బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేరస్థులకు సరైన శిక్ష పడటమే బాధితులకు నిజమైన న్యాయమని ఈ తీర్పు నిరూపించింది.

## మొసల్లు సంచారం ఆందోళనలో పశు పోషకులు



**టీ మీడియా, ఆగస్టు 12, పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని చేరువు చుట్టుపక్కల పశువులు మేతకు వస్తుంటాయి చెరువులో మొసల్లు సంచారం చేస్తుండటంతో మత్స్యకారులు మత్స్య సంపద కొరకు రోజూ వారిగా చెరువు దగ్గర కాపలా వుంటారు గొర్రెల బర్రెల పెంపకం దారులు స్థానికులు చెరువు చుట్టు పక్కలకు వెళ్ళాలంటే భయ బ్రాంతులకు గురవుతున్నారు ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి మొసళ్ళను పట్టి జూపార్క్ కు తరలించాలని ప్రజలు అభిప్రాయం వ్యక్త పరిచారు

## పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**టి మీడియా, ఆగస్టు 12, ఖమ్మం లీగల్:** పాఠశాలకు వెళ్లిన బాలికను తన మాయ మాటలతో లైంగికదాడికి ఒడిగట్టిన నిందితుడికి జీవిత కాలం పాటు జైలు శిక్ష, యాభై ఏడు వేల రూపాయలు జరిమానాలు విధిస్తూ.. మొదటి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి డా. పుల్లభట్ల పోగడ కృష్ణ అర్జున్ బుధవారం తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2023 సెప్టెంబర్ 20 న నిందితుడైన సూర్యాపేట జిల్లా, అంజనపురి కాలనీ చెందిన,అల్లి రాకేష్ 22 సం,, పాఠశాలకు వెళ్లిన బాలికను మాయమాటలతో బలవంతంగా బయటకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన అనంతరం విచారణ, పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడి పై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదించారు. కోర్టు కానిస్టేబుల్ తల్లా. రమణ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కె.శ్రీకాంత్, హోంగార్డ్ ఎం. డి అయూబ్ సహకరించారు.

# సింగిల్ విండోలపై కాంగ్రెస్ నేతల ఆశలు




## ⏭ పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు డిమాండ్

**టి మీడియా, ఆగస్టు 12, నాగర్‌కర్నూల్ :**
ప్రాథమిక సహకార సంఘాల సింగిల్ విండో సొసైటీల్లో నామినేటెడ్ పద్ధతిలో పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఆశలు పెరిగాయి. చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నామినేటెడ్ పద్ధతిలో పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు సింగిల్ విండో సొసైటీలకు డైరెక్టర్లు, చైర్మన్ల ప్రతిపాదనలను పంపించాలని, స్థానిక నాయకులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ నెల 5న హైదరాబాద్‌లోని ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ నివాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. పార్టీ కోసం కష్టపడ్డ వారితో పాటు చిరకాలంగా పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీకి సేవలు అందించిన వారిని గుర్తించి పదవులు కేటాయించాలని సమావేశంలో కోరినట్లు సమాచారం. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నట్లు తెలిసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్ నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట నుంచి డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి నుంచి కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి డాక్టర్ రాజేష్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఎంపీగా డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీగా కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కొనసాగుతున్నారు. జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సింగిల్ విండో చైర్మన్లు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సమాచారం. జిల్లాలో మొత్తం 23 సింగిల్ విండో సొసైటీలు ఉన్నాయి. రంగాపూర్, మాచినేనిపల్లి, పెంట్లవల్లి, నర్సాయిపల్లి, అంబటిపల్లి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, తాడూరు, కల్వకుర్తి, గన్యాకుల, తెలకపల్లి, కొండనాగుల, ఉప్పునుంతల, అచ్చంపేట, అమరాబాద్, బిజినేపల్లి, గౌరిట, పెద్దకొత్తపల్లి, వెల్దండ, కోడేరు, చారకొండ, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాలు ఉన్నాయి. ఈ 23 సహకార సంఘాలు కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి. నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేయనున్న నేపథ్యంలో డైరెక్టర్లు, చైర్మన్లతో పాటు డీసీసీబీ డైరెక్టర్లు, డీసీసీబీ చైర్మన్, ఈసీఎంఎస్ చైర్మన్, సభ్యుల పదవుల్లోనూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి అవకాశం లభించే అవకాశం ఉంది. దాదాపు 30 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులకు పదవులు కల్పించే ఉద్దేశంతో చేపట్టిన ఈ నామినేటెడ్ విధానం ఆశావహులకు ఊరటనిస్తోంది. నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండటంతో పదవుల ఎంపిక సులభతరమవుతుందని నాయకులు భావిస్తున్నారు. అయితే నియామకాల్లో రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకొని అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉందని కాంగ్రెస్ అధిష్టానం సూచించినట్లు సమాచారం. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం కోసం సీనియర్ కాంగ్రెస్ నాయకులను కూడా గుర్తించి పదవులు భర్తీ చేయాలని, సుమారు 60 శాతం మేర ఆ విధానంలో అవకాశాలు కల్పించాలని అధిష్టానం ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాలు, నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులకు గుర్తింపు లభించి పదవులు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల సమయంలో బుజ్జగింపుల్లో కొందరికి సింగిల్ విండో డైరెక్టర్ పదవులు ఇస్తామని హామీలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మార్కెట్ చైర్మన్ల ఎంపిక సమయంలోనూ పదవులు ఆశించిన నాయకులకు సింగిల్ విండో చైర్మన్ పదవులు ఇస్తామని పార్టీ నాయకులు చెప్పినట్లు సమాచారం. ఇప్పుడు అవకాశం రావడంతో అప్పట్లో పదవుల కోసం పోటీ పడిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేలను కలిసి తమకు సింగిల్ విండో చైర్మన్ పదవులు ఇవ్వాలని కోరే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా జిల్లాలో సింగిల్ విండో సొసైటీలకు నామినేటెడ్ పద్ధతిలో పదవులు భర్తీ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కొంత ఊరట లభించే అవకాశం కనిపిస్తోంది. పదవులను ఎప్పుడు భర్తీ చేస్తారోనని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ బాధ్యులు ఎప్పుడు అధిష్టానానికి నివేదికలు పంపిస్తారోనని ఆశావహులు ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.

# వెళ్లింది ఆరుగురు

## ⏭ తిరిగొచ్చింది మాత్రం ఐదుగురే

**టి మీడియా, ఆగస్టు 12, బూర్గంపాడు :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నకిరిపేటలో విషాదం చోటుచేసుకుంది. వేటగాళ్ళు అటవీ జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఓ ఫారెస్ట్ ఆఫీస్ ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచ రేంజ్ పరిధిలో ఉన్న చెరువు సింగారం బీట్ లో వన్యప్రాణులను వేటాడుతున్నారనే సమాచారంతో అటవీశాఖ సిబ్బంది మంగళవారం రాత్రి 10 గంటలకు ఫీల్డ్‌కు వెళ్లారు. ఈ క్రమంలోనే వన్యప్రాణుల కోసం అమర్చిన కరెంట్ తీగలు తగిలి బీట్ ఆఫీసర్ నవీన్ అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. అది గమనించిన తనతో పాటు ఉన్న సిబ్బంది అతన్ను వెంటనే 108 ద్వారా భద్రాచలం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ నవీన్‌ను పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అయితే నవీన్ రెండు నెలల క్రితమే బదిలీపై చెరువు సింగారం వచ్చారని.. ఇటీవలే ఆయన బీట్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టాడని తోటి సిబ్బంది తెలిపారు. గత కొంతకాలంగా బూర్గంపాడు మండల పరిధిలోని పలుచోట్ల వేటగాళ్లు కరెంటు



తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడడం పరిపాటిగా మారిందని, వన్యప్రాణుల వేటను కట్టడి చేసేందుకు వెళ్లిన తమ తోటి ఉద్యోగి విద్యుత్ షాక్ కు గురై ప్రాణాలు కోల్పోవడంతో తోటి సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న బూర్గంపాడు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# అమెరికాలో అగ్ని ప్రమాదం

## ⏭ హన్మకొండ జిల్లా విద్యార్థి మృతి

**టి మీడియా, ఆగస్టు 12, హన్మకొండ:**
అమెరికాలో విషాదం నెలకొంది. 15 రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో 75 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరిన హన్మకొండ జిల్లా విద్యార్థి మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. వివరాల్లోకి వెళ్లే.. హసన్‌పర్తి మండలం గంటూర్‌పల్లికి చెందిన భరత్ చందర్ ఉన్నత విద్య కోసం 2023లో అమెరికా వెళ్లాడు. ఫ్లోరిడాలోని టాంపాలో ఉంటున్నారు. చదువు పూర్తవ్వడంతో ఇండియాకు వచ్చి పెళ్లి చేసుకుందామని అనుకున్నాడు. కానీ ఇంతలోనే అగ్నిప్రమాదానికి గురయ్యాడు. గత నెల 25వ తేదీన జరిగిన ఫైర్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు 75 శాతం శరీరం కాలడంతో అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే 15 రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న భరత్.. తుదిశ్వాస విడిచారు. భరత్ మృతితో అతని స్వగ్రామమైన గంటూర్‌పల్లిలో



విషాదఛాయలు అలుముకున్నాయి. చదువు పూర్తి చేసుకుని తిరిగొస్తే పెళ్లి చేద్దామని అనుకుంటే.. ఇంతలోనే ఇలాంటి విషాద వార్త వినాల్సి వచ్చిందని భరత్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కుమారుడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకురావాలని కోరుతున్నారు.

# ధ్రువీకరణపత్రంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు



## ⏭ జులై 25న జీవో ఇచ్చిన ప్రభుత్వం

**టి మీడియా, ఆగస్టు 12, హైదరాబాద్ బ్యూరో:**
ఎస్ఐఆర్‌లో ఓటరు అర్హత ధ్రువీకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కేవలం రేషన్‌కార్డుకు సమానమైన డాక్యుమెంట్ మాత్రమేనని సీఈసీ తెలిపింది. సుప్రీంకోర్టు ఆమోదించిన 12 డాక్యుమెంట్లలో రేషన్‌కార్డు లేనందున దాని ఆధారంగా ఇచ్చే ఎఫ్ఆర్‌సీని పరిగణనలోకి తీసుకోలేమని తేల్చి చెప్పింది. అవసరమైతే ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన మెమో నిబంధనల మేరకు జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సమర్పించవచ్చునని సూచించింది.

**జీవో 172 జారీ**

ఈ నెల 17న ముసాయిదా జాబితా ప్రచురించిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సుమారు కోటి మందికి ఎన్నికల కమిషన్ నోటీసులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈసీ నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు అర్హతను ధ్రువీకరించుకునేందుకు 12 పత్రాల్లో ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. ఆ పన్నెండు డాక్యుమెంట్లలో రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కూడా ఒకటని నోటిఫికేషన్‌లో సీఈసీ తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూడా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఇటీవల నిర్ణయించిన ప్రభుత్వం గత నెల 25న జీవో 172 జారీ చేసింది. రేషన్ కార్డుల్లోని డేటా ఆధారంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు ఇవ్వాలని తహశీల్దార్లను ప్రభుత్వం ఆదేశించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టత రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పరిగణనలోకి తీసుకోవడంపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గత నెల 31, ఈ నెల 10వ తేదీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాశారు. మరోవైపు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఎస్ఐఆర్‌కు పరిగణనలోకి తీసుకోవద్దంటూ దాఖలైన పిటిషన్లపై స్పందించాలని సీఈసీ, సీఈవోలను హైకోర్టు కూడా ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లుబాటుపై కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టతనిచ్చింది.

**కేవలం రేషన్‌కార్డుకు సమానం**

ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఇచ్చే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదని స్పషం చేసిన సీఈసీ, అవసరమైతే 2013 జులై 25న ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోకు అనుగుణంగా జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. గత మెమో ప్రకారం దరఖాస్తు వివరాలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేస్తారని, కొత్త జీవో ప్రకారం ఎలాంటి విచారణ చేయకుండా కేవలం రేషన్‌కార్డులోని డేటాను మాత్రమే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ రూపంలో ఇస్తున్నారని సీఈసీ పేర్కొంది. ప్రభుత్వం జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కేవలం రేషన్‌కార్డుకు సమానమైన డాక్యుమెంట్ మాత్రమేనని సీఈసీ తెలిపిందిఎస్ఐఆర్ ప్రక్రియలో సుప్రీంకోర్టు ఆమోదించిన ఓటరు అర్హత ధ్రువీకరణ పత్రాల్లో రేషన్‌కార్డు లేదని కేంద్ర ఎన్నికల కమిషన్ వివరించింది. కాబట్టి రేషన్‌కార్డుకు సమానమైన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను ఎస్ఐఆర్‌కు చెల్లదని స్పష్టం చేసింది. అయితే గత నెల 25కు ముందు జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది.

# ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



**టీ మీడియా, ఆగస్టు 12,ఆళ్లపల్లి :**
భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన దేశంలోనే తొలి విద్యార్థి సంఘం, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి తాళ్లపల్లి వినయ్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కొమరం హనుమంతరావు ముందుగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బద్రుద్దీన్, ప్రేమ్ నారాయణ భార్గవ్‌ల నాయకత్వంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి మహనీయుల ఆశయ సాధనే లక్ష్యంగా రూపుదిద్దుకున్న ఏఐఎస్ఎఫ్, బ్రిటిష్ సామ్రాజ్యవాద బానిస సంకెళ్ల నుంచి మాతృభూమిని విముక్తి చేయడానికి వీరోచిత పోరాటాలు చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులుస్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# పాక్ నుంచి డ్రోన్లతో ఆయుధాల సరఫరా

## ⏭ నలుగురు అరెస్ట్?

**టి మీడియా, ఆగస్టు 12, ఢిల్లీ బ్యూరో:**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా ఆయుధాలు సరఫరా చేస్తున్న నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి అత్యాధునిక విదేశీ తయారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన ముగ్గురు యువకుల వయసు కేవలం 18 నుంచి 19 సంవత్సరాల మధ్యే ఉండటం గమనార్హం. అరెస్టైన నిందితుల్లో పంజాబ్‌కు చెందిన ఒకరు, హరియాణాకు చెందిన ముగ్గురు యువకులు ఉన్నారు. నిశాన్ సింగ్ పంజాబ్‌లోని అమృత్‌సర్ సరిహద్దు ప్రాంతమైన కక్కర్ గ్రామానికి చెందినవాడు. ఇతను తన గ్రామంలో డైరీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇక మిగిలిన ముగ్గురు రోహిత్, అజయ్, దేవ్ హరియాణా రాష్ట్రానికి చెందినవారిగా గుర్తించారు. వీరంతా పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఆయుధ రాకెట్ కోసం పనిచేస్తూ, దేశంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ రాకెట్ వెనుక భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న గ్యాంగ్‌స్టర్ దీపక్ నందాల్ ఈ ఆయుధ అక్రమ రవాణాకు సూత్రధారిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సరిహద్దు అవతలి నుంచి డ్రోన్ల సహాయంతో అక్రమంగా



ఆయుధాలను దేశంలోకి పంపిస్తున్నారు. ప్రధాన నిందితుడు నిశాన్ సింగ్ పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా తన వ్యవసాయ పొలంలోకి చేరే ఆయుధాలను రిసీవ్ చేసుకునేవాడు. ఆ తర్వాత వాటిని స్థానికంగా ఉన్న గ్యాంగ్‌స్టర్ దీపక్ నందాల్ ముఠా సభ్యులకు సురక్షితంగా చేరవేసేవాడని చండీగఢ్ ఎస్పీ (ఆపరేషన్స్) గీతాంజలి ఖండేల్‌వాల్ మీడియాకు వెల్లడించారు. పోలీసులు ఈ సోదాల్లో మూడు విదేశీ తయారీ పిస్టల్స్, రెండు మ్యాగజైన్లు, 19 లైవ్ కార్ట్రిడ్జెస్‌ను (తూటాలు) స్వాధీనం చేసుకున్నారు.

**హరియాణాలో టార్గెట్‌పై రెక్కీ**

పోలీసుల ప్రాథమిక విచారణలో షాకింగ్ నిజాలు వెలుగు చూశాయి. అరెస్టైన నిందితులు హరియాణాలోని గురుగ్రామ్‌లో ఓ టార్గెట్?ను లక్ష్యంగా చేసుకొని రెక్కీ కూడా నిర్వహించినట్లు తేలింది. నగరంలో పెద్ద ఎత్తున వ్యాపారులు, ధనికులను లక్ష్యంగా చేసుకుని బలవంతపు వసూళ్లు, ఇతర తీవ్ర నేరాలకు పాల్పడాలనే పక్కా వ్యూహంతో ఈ ముఠా రంగంలోకి దిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

**సోషల్ మీడియాలో పరిచయం**

హరియాణాలోని జింద్ ప్రాంతానికి చెందిన అజయ్ అనే యువకుడు మారుతి పరిశ్రమలో హెల్పర్?గా పని చేస్తుండేవాడు. సోషల్ మీడియా ద్వారా అతడికి గ్యాంగ్‌స్టర్ దీపక్ నందాల్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత అజయ్ తన స్నేహితులైన రోహిత్, దేవ్‌లను కూడా ఈ చీకటి ప్రపంచంలోకి లాగాడు. రోహిత్, దేవ్ కూడా జింద్ ప్రాంతంవారే కాగా, చిన్నచిన్న దుకాణాల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవారు. సోషల్ మీడియా ద్వారా ఏర్పడిన ఈ పరిచయాలు వారిని నేరాల వైపు నడిపించినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు.

# విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



## ⏭ తహసీల్దార్ కు వినతి పత్రం

**టిమీడియా,ఆగష్టు12,కురవి :**
ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు.ఎస్.పి.సి )ఆధ్వర్యంలో దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టిన అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కురవి మండల తహసిల్దార్ కు సమర్పించారు. ఈసందర్భంగాయూఎస్ పి సి జిల్లా నాయకులు యాకూబ్, బలాష్టి రమేష్ మాట్లాడుతూ... పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న ఆరు డి ఏ లను మంజూరు చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా సిపియస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ పోరాట కమిటీ బాధ్యులు గుండ్ల విజయ్ కుమార్, బొల్లం శ్రీనివాస్, మంజుల, ప్రవీణ్, దైద వెంకటేశ్వర్లు, శ్రీధర్, విజయ్ రాజ్, చెన్నూరి శ్రీనివాస్, వెంకటరాజు, రవీందర్, సలీం, బాబు తదితరులు పాల్గొన్నారు.